చెత్తబుట్టల పంపిణీ



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామస్తులకు మంగళవారం మున్సిపల్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి, కౌన్సిలర్ హంసరాణి కండ్లకోయలోని పలు వార్డుల్లో మహిళలకు చెత్త బుట్టలు అందజేసి పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వీడ్కోలు



షరీఫ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎండీ షరీఫ్‌ను మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం సన్మానించారు. అవుషాపూర్‌లోని మాజీ ఎంపీపీ నివాసంలో ఆయనను సత్కరించారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింహా

కీసర: అందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కీసర మండల ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింహ అన్నారు. మంగళవారం కీసరలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్స్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్నవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సోమనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కీసర: నాగారంలోని సుర్వి బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ కీసర ఉమ్మడి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రామిడి విజయ్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

కేటీఆర్‌కు పండగ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి శమీపత్రాన్ని అందజేశారు. పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని కేటీఆర్ సూచించినట్లు చెప్పారు. జగన్, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

నియోజకవర్గ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడికి సత్కారం



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమితులైన పుట్నాల కృష్ణను మంగళవారం ఫోరం తెలంగాణ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శాలువాతో ఘనంగా సత్కరించారు. ఫోరం సెక్రటరీ సురేందర్‌రెడ్డి, స్థానిక ఉద్యమకారులు ఉదయ్, శోభన్‌బాబు, వెంకటేష్‌యాదవ్, ముత్యాలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కలాంకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: భారతరత్న మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, శివకుమార్, వాణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు

ఘట్‌కేసర్‌లో..

భారత క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం జయంతి వేడుకలు అవుషాపూర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అబ్దుల్ కలాం పార్కులో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో కలాం జయంతి వేడుకల్లో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

18 ఏళ్లు నిండిన వారందర్ని
ఓటర్లుగా నమోదు చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో వార్డు మెంబర్ల సహకారంతో 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీసీహాల్‌లో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టరు పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఓటరు నమోదు శాతం పెరగడం లేదని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. ఇందుకుగాను వార్డు మెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ ప్రతినిధులను కోరారు. జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలన్నారు. భారత ప్రభుత్వ ఎన్నిక కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా, 1500 మందికి ఒక పోలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అదనంగా నియోజకవర్గాల వారీగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం జిల్లాలో 2,435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు. ఓటర్లకు సమీపంగా, సౌకర్యవంతంగా ఉండేలా పరిశీలించి ఈ పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల నెంబర్ల సవరింపులో కొన్ని బూతుల నెంబర్లు మారుతాయని, బూతు పోలింగ్ అధికారులు ఈ మార్పు పై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని నిమిషాంబ దేవి, పోశమ్మ, బంగారు మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు రాపోలు రాములు పాల్గొన్నారు. వేద పండితుల ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఆలయాలు ప్రశాంత నిలయాలుగా ఉండాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ చీరాల నర్సింహ, మేడ్చల్ నియోజకవర్గ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు బొమ్మక్ శ్రీనివాస్, చెంచల నర్సింగ్ రావు పాల్గొన్నారు.

యూటర్న్‌ను పునరుద్ధరించాలి



పీర్జాదిగూడ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొల్తూరి సాయి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరంగల్ జాతీయ రహదారిపై స్పార్క్ ఆసుపత్రి వద్ద ఉన్న యూటర్న్‌ను మూసివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొల్తూరి సాయి అన్నారు. పీర్జాదిగూడ, పర్వతాపూర్, కాచవాని సింగారం, ప్రతాప్ సింగారం వెళ్లే వాహనదారులు పీర్జాదిగూడ కమాన్ మార్గం ద్వారా తమ గమ్యాలకు వెళ్లేవారు. అయితే అక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో ట్రాఫిక్ పోలీసులు స్పార్క్ ఆసుపత్రి ముందు యూటర్న్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలు కారణాలతో ఆ యూటర్న్‌ను మూసివేయడంతో ఉప్పల్ నుంచి వచ్చేవారు, అటు నారాపల్లి, మేడిపల్లి నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురౌతున్నారని, వెంటనే యూటర్న్ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మేయర్ అమర్‌సింగ్ తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వచ్చే నెల 14 వరకు గాలికుంటు నివారణ టీకాలు

కీసర: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు కీసర మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. 3 నెలల వయస్సు పైబడిన దూడలతో పాటు ఆవులు, గేదెలకు టీకాలు వేయించాలని కోరారు. వైరస్ వల్ల గాలికుంటు వ్యాధి సోకుతుందని, దీని ప్రభావంతో పశువులకు అధిక జ్వరం, నోటిలో పుండ్లు, కాలి గిట్టలలో పుండ్లు ఏర్పడి నడవలేక పోతాయన్నారు. పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పశువులకు వచ్చే ఈ వ్యాధిని టీకాలతో నివారించవచ్చన్నారు. మంగళవారం 4324 పశువులకు టీకాలు వేశామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. నాయకులు చిన్నాయాదవ్, నవీన్ యాదవ్, సుకేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శ్రీనగర్ కాలనీలోని సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. శ్రీనగర్‌కాలనీలో రూ. 26 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని లేదంటే సహించేది లేదని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. వర్షపు నీరు రోడ్డు మీద నిల్వకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈఈ హరిలాల్, ఏఈ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్

పోచారం: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు కూల్చివేతలకు గురైనా ధైర్యంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళనతో పాటు చెరువుల పరిరక్షణ చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఇతర పార్టీలతో పాటు కాంగ్రెస్ నాయకుల నిర్మాణాలున్నా తొలగించక తప్పదన్నారు. నాయకుల మధ్య పాత, కొత్త తేడాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు వేశామని తెలిపారు. పాత వారికి ప్రాధాన్యత తగ్గుతోందన్న విషయంపై సమావేశంలో ఘర్షణ జరగడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్, బోడుప్పల్ మేయర్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మేడ్చల్: ఆరునెలలుగా పెండింగ్ బిల్లులు రావడం లేదని వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు మండల పరిషత్ ఆవరణలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. కోడిగుడ్ల బిల్లులు, ఇతర బిల్లులు 6 నెలలుగా రావడం లేదని, బిల్లులు రాక తాము ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

కబ్జాలపై చర్యలేవి ?

పరిరక్షించాలని కాలనీవాసుల ఆందోళన

బోడుప్పల్: కబ్జాదారుల నుంచి తమ ప్లాట్‌లను కాపాడాలని అంబేడ్కర్‌నగర్ ఫేస్ – 3 కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. మంగళవారం బోడుప్పల్ దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ ఫేస్ 1,2, రాజీవ్‌నగర్, గౌతమీనగర్ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్‌లను కొంతమంది కబ్జా చేసి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. 10 మంది వ్యక్తులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఖాళీగా ఉన్న ప్లాట్‌లకు పోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించారని ఆరోపిస్తున్నారు. సదరు స్థలంలో రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వాపోయారు. బోడుప్పల్ కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య చైర్మన్ రాపోలు రాములు, ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అబ్రహం లింకన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు ఘటనా స్థలాన్ని సందర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పేదల స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



పట్టాలతో ఆందోళన చేపట్టిన కాలనీవాసులు

కాంగ్రెస్‌లో నాలుగు స్తంభాలాట

నలుగురు నేతల మధ్య నలిగిపోతున్న కార్యకర్తలు

- పార్టీకి విధేయులుగా ఉన్నా నాయకులకు దక్కని పదవులు
- మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంతో బయటపడ్డ నేతల అసంతృప్తి

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్‌ను నడిపించే నాయకుడు లేకపోవడంతో కార్యకర్తలు నిత్యం అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఏళ్ళుగా పార్టీకి విధేయులుగా ఉంటూ వస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కపోవడం, నాయకుల భజన చేసే వారికి పదవులు దక్కకపోవడంతో సీనియర్లు అసమ్మతి గళం విప్పుతున్నారు.

నలుగురు ఉన్నా.. నాయకుడు కరువు

మేడ్చల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో నాయకుల, ప్రజా ప్రతినిధుల చేరికతో ఆ పార్టీ బలంగానే మారింది. నాయకులు, కార్యకర్తలు ఫుల్‌గానే ఉన్నా నడిపించే నాయకుడు కరువయ్యాడు. నలుగురు నాయకులు తలోదారిలో ఉండటంతో నియోజకవర్గ కాంగ్రెస్ నాలుగు ముక్కలుగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఆధిక్యత రాకపోవడంతో ఆ పార్టీ పేపర్ పై బలంగా ఉన్నా ప్రజాక్షేత్రంలో అంత బలంగా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిన తోటకూర వజ్రేష్‌యాదవ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఉన్నారు. ఏళ్ళ నుంచి టికెట్ ఆశిస్తూ భంగపడ్డ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన నక్క ప్రభాకర్‌గౌడ్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అగ్ర నాయకులుగా ఉన్నారు. వీరంతా ఒక్కో సమయంలో ఒక్కో పార్టీ నుంచి మేడ్చల్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారే. గత ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ప్రచారం చేయకుండా హరివర్ధన్‌రెడ్డి కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయగా మిగతా నాయకులు తోటకూర, నక్క, సుధీర్‌రెడ్డి ముగ్గురూ కలిసి ఎన్నికలను ఎదుర్కొన్నా ఓటమిని చూశారు. ఎన్నికల తర్వాత హరివర్ధన్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కాగ, వజ్రేష్‌యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయ్యారు. సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ తమ స్థాయిలో రాజకీయం చేస్తున్నారు.

ఒకరి వద్దకు వెళ్తే మరొకరికి కోపం..

నియోజకవర్గంలో సాధరణ కార్యకర్త ఒక్క నాయకుడి దగ్గరికి వెళ్తే మరో నాయకుడికి కోపంగా మారుతుంది. దీంతో కార్యకర్త నుంచి మండల నాయకుడి వరకు ఏదైనా పని మీద వెళాల్సి వస్తే నలుగురు నేతలను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తుంది. నలుగురు నేతలను కలిసి రావాల్సి వస్తుంది. ఎన్నికల తర్వాత నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల చైర్మన్‌లు, మేయర్లు దించడానికి చేరికలను ప్రోత్సహించి నూతన వారిని గద్దెను ఎక్కించడంలో సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్ కలిసి పని చేయగా మిగతా వారు దూరంగా కనిపించారు.

తాజాగా మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం తోటకూర వజ్రేష్‌యాదవ్ నర్సింలు యాదవ్ పేరును, హరివర్ధన్‌రెడ్డి వైఎస్ గౌడ్‌ను ప్రతపాదించగా అధిష్టానం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింలు యాదవ్‌ను ప్రకటించింది. డైరక్టర్లుగా నాయకుల అనుచరుల పేర్లను ప్రకటించడంతో సీనియర్లు విస్మయం చెందారు. 30 ఏళ్ళుగా పార్టీని నమ్ముకుని నాయకులు మారినా తాము పార్టీ కోసం పని చేస్తే అధికారంలోకి వచ్చాక తమను ఖాతరు చేయడం లేదని సీనియర్ నాయకులు అధిష్టానంగా చెప్పుకుంటున్న నలుగురు నాయకులపై బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకులు ఇటీవల మేడ్చల్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ అగ్ర నాయకుల తీరును తప్పుపట్టారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మొత్తం మీద మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో నాలుగు స్తంభాలాట సాగుతోంది.

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి: రాధికా గుప్తా



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్)రాధికా గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీపీఎస్సీ గ్రూప్–1 రాత పరీక్ష పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఆమె మాట్లాడారు. చీఫ్ సూపరిటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. ప్రతి ఒక అంశం నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని ఆమె సూచించారు. చీఫ్ సూపరిటెండెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రూప్–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలను సూచించారు. భద్రత పోలీసుశాఖ వారితో నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు సంబంధిత శాఖల అధికారులతో కో–ఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే మీకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలో రూట్ మ్యాప్‌లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిని సరిగా ఉన్నాయా అని పరిశీలించాలి. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులకు అందించే డైరీ ప్రకారం టైమ్ టు టైమ్ సరైన విధంగా విధులు నిర్వహించాలని అన్నారు.